సాక్షి
కుమురం భీం
సోమవారం : 1 : మే : 2023



కానిస్టేబుల్ తుది రాతపరీక్ష
కానిస్టేబుల్ తుది రాత పరీక్ష ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రశాంతంగా నిర్వహించారు. వర్షంతో అభ్యర్థులు ఇబ్బంది పడ్డారు. 8లో▸



వాసవీమాత జయంతి
కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ పట్టణాల్లో వాసవీమాత జయంతి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వాసవీమాతకు ప్రత్యేక పూజలు చేశారు. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
31.3 /22.2
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంకన్నా తక్కువగా నమోదవుతాయి. ద్రోణి ప్రభావంతో చాలా ప్రాంతల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతల దృష్ట్యా మే 1 నుంచి 31 వరకు 30 పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉంటుందని ఎస్పీ సురేశ్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి పబ్లిక్ సమావేశాలు, ఊరేగింపులు, ధర్నా కార్యక్రమాలు నిర్వహించొద్దన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు పోలీసు అధికారులకు సహకరించాలని కోరారు.

నేటి నుంచి బాక్సింగ్ సమ్మర్ క్యాంపు

కాగజ్‌నగర్‌టౌన్: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్ ఎఫ్ కాలనీలో గల ముత్తు బాక్సింగ్ క్లబ్ వద్ద సోమవారం నుంచి ఉచిత బాక్సింగ్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఆదిలాబాద్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, ట్రైనర్ మధురై శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత శిక్షణ ప్రతిరోజూ ఉదయం 5.30 నుంచి 7.30 వరకు, సాయంత్రం 5.30 నుంచి 7.30 వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఉచిత సమ్మర్ బాక్సింగ్ క్యాంపును యువత, పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రారంభోత్సవానికి ఆదిలాబాద్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు నివాస్ గౌడ్, చైర్‌పర్సన్ కోనేరు వంశీ, ఉపాధ్యక్షుడు వి.మధు, జయేందర్, రమాకాంత్, జాకిర్ తదితరులు హాజరవుతారని వెల్లడించారు.

సరస్వతి శిశుమందిర్‌లో కబడ్డీ శిక్షణ
ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో కబడ్డీ ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు పీడీ తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు సోమవారం ఆధార్ కార్డుతో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ ఉదయం 5:30 నుంచి 7:30, సాయంత్రం 5:30 నుంచి 6:30 వరకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 99493 00668 సంప్రదించాలని కోరారు.

శివాలయంలో జిల్లా జడ్జి పూజలు



జడ్జి దంపతులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్రవీణ్

వాంకిడి(ఆసిఫాబాద్): వాంకిడి మండల కేంద్రంలోని శివకేశవ ఆలయాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమేశ్ దంపతులు సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షుడు గాదె ప్రవీణ్ కుమార్‌ను అడిగి ఆలయ ప్రత్యేకతలు, విశిష్టతను తెలుసుకున్నారు. అనంతరం జడ్జి దంపతులను శాలువతో సన్మానించారు.

పరిహారం చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న అధికారులు

వాంకిడి(ఆసిఫాబాద్): మండలంలోని నవేగాం అటవీప్రాంతంలో పులి దాడిలో ఎద్దును కోల్పోయిన లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన నికోరే శివాజీకి అటవీశాఖ అధికారులు ఆదివారం నష్ట పరిహారం అందజేశారు. ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.25 వేల చెక్కును స్థానిక సర్పంచ్ నీలాబాయి చేతుల మీదుగా అందజేశారు. ఎఫ్ఎస్‌వో లక్ష్మణ్, ఎఫ్‌బీవో శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఎస్పీఎం కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్లులో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, తక్షణమే జీవో 22 అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంబాల ఓదేలు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ 2014లో మూతబడిన ఎస్పీఎం కార్మికుల సుదీర్ఘ పోరాటం ఫలితంగా 2018లో పునఃప్రారంభమైందన్నారు. అయినా కాంట్రాక్టు కార్మికులకు ఎలాంటి ప్రయోజనం దక్కలేదని ఆరోపించారు. కాంట్రాక్టు కార్మికులకు రూ.35 వేల చొప్పున వడ్డీతో సహా చెల్లిస్తామని మంత్రులు, ఎమ్మెల్యేలు వాగ్దానం చేసినా చెల్లింపులు జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

లెక్కలన్నీ ఒకే చోట..!



జిల్లా కేంద్రంలో లోకోస్ యాప్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

- మహిళా సంఘాల లావాదేవీల కోసం ప్రత్యేక యాప్
- నేటి నుంచి లోకోస్ యాప్ సేవలు ప్రారంభం
- ఇప్పటికే ఏపీఎం, సీసీలకు శిక్షణ
- జిల్లాలో 7,953 సంఘాల పరిధిలో 87,947 మంది సభ్యులు



వాంకిడి(ఆసిఫాబాద్): మహిళా సంఘాల సభ్యుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది సిబ్బంది పొదుపు నగదును పక్కదారి పట్టించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. సంఘాలకు సంబంధించిన వివరాల నమోదుకు అనేక యాప్‌లు ఉండటంతో సిబ్బందిపైనా పనిభారం పడుతోంది. ఈ నేపథ్యంలో మహిళా సంఘాల నిర్వహణను సులభతరం చేసేందుకు, లావాదేవీల్లో మరింత పారదర్శకత కోసం ప్రభుత్వం లోకోస్ అనేక ప్రత్యేక యాప్ అందుబాటులోకి తెచ్చింది. దీంతో పొదుపు సంఘాల లెక్కలు ఇక పక్కాగా ఉండనున్నాయి. రుణాలు, వడ్డీలు, సంఘాల కార్యకలాపాలు, పొదుపు వివరాలు పారదర్శకతతో నమోదు చేయనున్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ అభివృద్ధి చేసిన లోకోస్ యాప్ సోమవారం నుంచి వినియోగంలోకి రానుంది. యాప్ వినియోగంతో మహిళలు ఎక్కువ సంఘాల్లో సభ్యులుగా ఉంటూ రుణాలు పొందేందుకు ఇకపై అవకాశాలు ఉండవు. సభ్యులు కూడా లావాదేవీల వివరాలను ఒకేచోట చూసుకునేందుకు అవకాశం కలగనుంది.

శిక్షణ తరగతులు పూర్తి..
మహిళా సంఘాల సభ్యుల నుంచి ఏఏ వివరాలు సేకరించాలి.. యాప్‌లో వివరాలు ఎలా అప్‌లోడ్ చేయాలి.. అనే విషయాల గురించి జిల్లా వ్యాప్తంగా 'లోకోస్' ట్రైనర్లు సిబ్బందికి ఇప్పటికే అవగాహన కల్పించారు. మే నుంచి మహిళా సంఘాల పూర్తి వివరాలు యాప్‌లో పొందుపర్చాల్సి ఉన్న నేపథ్యంలో యాప్‌లో వివరాల నమోదు ప్రక్రియ, తదితర అంశాలపై డీఆర్డీవో, ఆడిటర్లు, డీపీఎం, ఏపీఎంలు, సీసీలు, మండల సమాఖ్య అకౌంటెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇటీవల జిల్లా కేంద్రంలో ఏపీఎంలు, సీసీలకు డీపీఎంలు ఒక్కరోజు శిక్షణ అందించారు. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, సమస్యలు పరిష్కరించాలని వీవోఏలు సమ్మెలో ఉన్న నేపథ్యంలో వారు శిక్షణ తరగతులకు హాజరు కాలేదు. త్వరలోనే మండల కేంద్రాల్లో యాప్ వినియోగంపై వీవోఏలకు అవగాహన కల్పించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లా వివరాలు

మండలం	వీవోలు	సంఘాలు	సభ్యులు
ఆసిఫాబాద్	47	912	9,909
బెజ్జూర్	20	415	4,644
చింతలమానెపల్లి	19	434	4,979
దహెగాం	19	518	5,405
జైనూర్	32	532	6,012
కాగజ్‌నగర్	43	898	9,829
కెరమెరి	34	523	5,600
కౌటాల	21	564	6,383
లింగాపూర్	18	266	3,078
పెంచికల్‌పేట్	13	249	2,661
రెబ్బెన	26	693	7,607
సిర్పూర్(యు)	19	293	3,458
సిర్పూర్(టి)	24	493	5,654
తిర్యాణి	27	465	5,255
వాంకిడి	36	698	7,473

మరింత పారదర్శకత

జిల్లాలోని 15 మండలాల్లో 398 వీవోలు ఉన్నాయి. ఇందులో మొత్తం 7,953 ఎస్‌హెచ్‌జీలు ఉండగా, 87,947 మంది సభ్యులుగా కొనసాగుతున్నారు. మహిళలు ఆర్థికంగా బలపడాలనే ఉద్దేశంతో ప్రభుత్వం బ్యాంకుల నుంచి మహిళా సంఘాలకు రుణాలు అందిస్తోంది. రుణాల చెల్లింపు, వడ్డీ, బకాయిలు తదితర అంశాల్లో లోకోస్ యాప్ వినియోగంతో మరింత పారదర్శకత రానుంది. సభ్యులు రుణాలు తీసుకున్న సమయం నుంచి ప్రతీ లావాదేవీ యాప్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. దీని ద్వారా పర్యవేక్షణ పెరిగి, అవకతవకలకు అడ్డుకట్ట పడుతుందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం పొదుపు సంఘాల పర్యవేక్షణ విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ల పరిధిలో ఉంది. సంఘాల పనితీరు, ఆర్థిక లావాదేవీలు, ఇతర అంశాలకు వేర్వేరు యాప్‌లు వినియోగంలో ఉన్నాయి. పర్యవేక్షణ లేకపోవడంతో కిందిస్థాయి సిబ్బంది రుణాల చెల్లింపులు చేయకుండా ఇతర ఖాతాలకు మళ్లించినా గుర్తించేందుకు ఆలస్యమవుతుంది. అవకతవకలు చోటుచేసుకోకుండా, సులభంగా లావాదేవీల నిర్వహణ ఉండేలా గ్రామీణ పేదరికనిర్మూలణ సంస్థ ఈ యాప్‌ను రూపొందించింది.

నేటి నుంచి అందుబాటులోకి..



పొదుపు సంఘాల సభ్యుల సమగ్ర సమాచారం ఒకే చోట ఉండేలా రూపొందించిన లోకోస్ యాప్ సోమవారం నుంచి అందుబాటులోకి వస్తుంది. ఇప్పటికే జిల్లాలోని డీపీఎం, ఏపీఎంలు, సీసీలకు శిక్షణ తరగతుల నిర్వహణ పూర్తి చేశాం. సంఘాలకు సంబంధించి రుణాలు, వాయిదాలు, లావాదేవీలు వంటి వివరాలు ఇక సులువుగా తెలుసుకోవచ్చు. – శ్రీనివాస్, అదనపు డీఆర్‌డీవో

సచివాలయ ప్రారంభోత్సవంలో మనోళ్లు



మంత్రి ఐకేరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజాప్రతినిధులు

నిర్మల్ టౌన్: హైదరాబాద్‌లోని బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయాన్ని ఆదివారం సీఎం కేసీఆర్ ప్రారంభించగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు హాజరయ్యారు. నాలుగో అంతస్తులోని తన చాంబర్‌లో ఆసీనులైన రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఐకేరెడ్డి గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని నాలుగు జిల్లాల్లోగల 100 ఆలయాలకు ధూప దీప నైవేద్య పథకాన్ని వర్తింపజేసే.. ప్రధాన ఆలయాల్లో మిల్లెట్ ప్రసాదాన్ని అందుబాటులోకి తెచ్చే ఫైళ్లపై సంతకం చేశారు. మంత్రిని కలిసిన వారిలో కలెక్టర్లు రాహుల్‌రాజ్, బదావత్ సంతోష్, వరుణ్‌రెడ్డి, హేమంత్ బోర్కడే, ఎమ్మెల్సీ దండే విఠల్, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యేలు రేఖానాయక్, విఠల్‌రెడ్డి, జోగు రామన్న, రాథోడ్ బాపురావు, కోనేరు కోనప్ప, దుర్గం చిన్నయ్య, డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, బీఆర్ఎస్ యువ నాయకులు అల్లోల దివ్య, గౌతమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సంతకం చేస్తున్న మంత్రి ఐకేరెడ్డి



ఐకేరెడ్డితో ఉమ్మడి జిల్లాలోని కలెక్టర్లు

పాఠ్యపుస్తకం వచ్చేస్తోంది..!

- విడతల వారీగా జిల్లాకు సరఫరా
- బడుల ప్రారంభం రోజే అందించేందుకు విద్యాశాఖ చర్యలు
- గోదాంకు చేరిన 1,94,268 పుస్తకాలు



పాఠ్యపుస్తకాలు దించుతున్న సిబ్బంది

ఆసిఫాబాద్‌అర్బన్: ఏటా పాఠ్యపుస్తకాల పంపిణీలో జాప్యంతో నెలల తరబడి విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో 2023- 24 విద్యాసంవత్సరం ప్రారంభం రోజే విద్యార్థుల చేతికి పాఠపుస్తకాలు అందజేయాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా విడతల వారీగా జిల్లాలకు పుస్తకాల సరఫరాను ప్రారంభించారు.

పంపిణీ ప్రక్రియ..
గత విద్యాసంవత్సరంలో పాఠ్యపుస్తకాల పంపిణీ ఆలస్యం కావడంతో అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వచ్చాయి. కొన్నిచోట్ల విద్యార్థులు పాత వాటితో సర్దుకోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో బడుల పునఃప్రారంభం రోజే పాఠ్యపుస్తకాల పంపిణీ ప్రక్రియ ప్రారంభించాలని నిర్ణయించారు. ఇప్పటికే జిల్లాలకు పుస్తకాల సరఫరా మొదలైంది. జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలోని గోదాంలో పాఠ్యపుస్తకాలను భద్రపరుస్తున్నారు.

4.88లక్షల పుస్తకాలు అవసరం..
ఇప్పటికే విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించా రు. వేసవి సెలవుల అనంతరం జూన్ 13 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానునున్నా యి. బడుల ప్రారంభం నాటికి కొత్త యూని ఫాం, పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు చేరేవిధంగా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో అన్నిరకాల ప్రభుత్వ పాఠశాలలు 1,273 ఉన్నాయి. ఆ యా స్కూళ్లలో మొత్తం 96,337 మంది చదువుకుంటున్నారు. వీరికి 4,86,278 పాఠ్యపుస్తకాలు అవసరమవుతాయని అధికారులు గుర్తించారు. ఇప్పటికే జిల్లా కేంద్రంలోని గోదాంకు 1,94,268 పుస్తకాలు చేరుకున్నాయి. ప్రభుత్వ ఆదేశాలతో ఒకే పుస్తకంలో ఇంగ్లిష్, తెలుగు మీడియం పాఠాలు అందుబాటులో ఉండేలా చూస్తున్నారు. పుస్తకాలను పార్ట్ 1, 2గా విభజించారు. 50శాతానికి పైగా పుస్తకాలు వచ్చిన తర్వాత ఎమ్మార్సీలకు తరలిస్తారు. అనంతరం ఆయా మండలాల పరిధిలోని ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలకు సంబంధించిన పుస్తకాలు తీసుకెళ్లాల్సి ఉంటుందని అధికారులు వెల్లడించారు.

గోదాములో భద్రపరిచాం..



జిల్లాకు ఇప్పటికే 1,94,268 పాఠ్యపుస్తకాలు వచ్చాయి. వాటిని ఆసిఫాబాద్‌లోని గోదాంలో భద్రపరుస్తున్నాం. మిగిలినవి వచ్చిన తర్వాత మండలాల వారీగా సరఫరా చేస్తాం. అక్కడి నుంచి పాఠశాలలకు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పంపిణీ జరుగుతుంది. 2023- 24 విద్యా సంవత్సరం ప్రారంభం రోజే పుస్తకాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.
– సత్యనారాయణ, టెక్స్ట్ బుక్ డిపో మేనేజర్

ఆరె కులస్తులను ఓబీసీలో చేరుస్తాం



మాట్లాడుతున్న హన్స్‌రాజ్ గంగారాం అహీర్



సిర్పూర్(టి)లో విగ్రహ ఊరేగింపు

- జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాం అహీర్
- సిర్పూర్(టి)లో ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ

సిర్పూర్(టి): రాష్ట్రంలోని ఆరె కులస్తులను ఓబీసీలో చేరుస్తామని జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాం అహీర్ అన్నారు. సిర్పూర్(టి) మండల కేంద్రంలోని హనుమాన్ నగర్ కాలనీలో ఆదివారం నిర్వహించిన శివాజీ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆరె కులస్తులు వివక్షతకు గురవుతున్నారన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేస్తే వెంటనే ఓబీసీలో చేర్చుతామని హామీ ఇచ్చారు. మారుమూల సిర్పూర్(టి) ప్రాంతంలో ఛత్రపతి శివాజీ విగ్రహం ఆవిష్కరించడం శుభసూచకమని అభినందించారు. అంతకు ముందు శివాజీ విగ్రహంతో మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. శివాజీ నినాదాలతో హోరెత్తించారు. కాలనీలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆరె కుల సంఘం జిల్లా అధ్యక్షుడు బొట్టుపల్లి జయరాం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, నాయకుడు పాల్వాయి హరీశ్‌బాబు, మండల అధ్యక్షుడు ఎల్కులే శంకర్, నాయకులు శంకర్, దుబ్బుల నానాయ్య, వెంకన్న, రాందాస్, సత్యనారాయణ, శ్యాంరావ్, లావణ్య, కిషోర్‌కుమార్, నానాజీ, పురుషోత్తం, అశోక్ ఆర్య తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీలో పలువురి చేరిక

బెజ్జూర్(సిర్పూర్): జిల్లాకు చెందిన ఆదివాసీ రాష్ట్ర నాయకుడు సోయం చిన్నయ్య, బీజేపీ నాయకులు తలండి భిక్షపతి, నందరాం, పొర్తెటి రత్నయ్య, ఆత్రం రంజిత్ ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ సమక్షంలో బీఎస్పీలో చేరారు. ఈ సందర్భంగా బీఎస్పీ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఏకమై బహుజన రాజ్య స్థాపనకు పాటుపడదామని పిలుపునిచ్చారు. పేదవర్గాల పాలనలోనే అందరి బతుకుల్లో వెలుగులు నిండుతాయన్నారు. గడపగడపకూ బీఎస్పీ జెండాను తీసుకెళ్లాలని కోరారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ వారికి కండువా వేసి ఆహ్వానించారు.

అందిపుచ్చుకుంటే అవకాశాలెన్నో..!

- ఉమ్మడి జిల్లాకు నాలుగు డ్రైవింగ్ స్కూల్స్
- రెండేళ్ల క్రితమే అనుమతులు
- అభ్యర్థులు రాక ప్రారంభంకాని శిక్షణ
- కొరవడిన ప్రచారం



డ్రైవింగ్ ఇన్‌స్టిట్యూట్ గది



శిక్షణ కోసం ఏర్పాటు చేసిన బస్సు

మంచిర్యాలఅర్బన్: మారుతున్న కాలంలో వాహనాల కొనుగోళ్లు పెరుగుతున్నాయి. కొత్తగా డ్రైవింగ్ నేర్చుకోవాలంటే కుటుంబ సభ్యులు, తెలిసిన వారి ద్వారా నేర్చుకుంటారు. లేదంటే డ్రైవింగ్ స్కూల్‌కు వెళ్తారు. ద్విచక్ర వాహనాలు, కార్లు నడపడం నేర్చుకునేందుకు ప్రత్యేకంగా డ్రైవింగ్ స్కూల్స్ ఉన్నాయి. మరి భారీ వాహనాలు నడపడం నేర్చుకోవాలంటే ఎంతో కట్టుదిట్టమైన శిక్షణ అవసరం. భారీ వాహనాల డ్రైవింగ్ నేర్పించే సంస్థలు అడపాదడపా ఉన్నా నైపుణ్యం కలిగిన శిక్షకులు అంతంతమాత్రంగానే ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ డిపోల్లో డ్రై వింగ్ స్కూల్స్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, మంచిర్యాలలో ఏర్పాటు చేసేందుకు రెండేళ్ల క్రితం అనుమతులు లభించాయి. ప్రచారలోపమో.. మరేదైనా కారణమో కానీ డ్రైవింగ్ స్కూల్‌కు ఆదరణ కరువైంది.

ఆర్టీసీలో తర్ఫీదుతో...
ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రైవింగ్ స్కూల్‌లో సీనియర్ డ్రైవర్లు అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. తద్వారా వాహనం నడపడంపై ఎన్నో మెలకువలు నేర్చుకునే అవకాశాలు ఉన్నాయి. డ్రైవింగ్ స్కూల్‌లో కండీషన్ ఉన్న వాహనం (ప్రత్యేక బస్సు)ద్వారా శిక్షణ ఇవ్వనున్నారు. థియరీ బోధనకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేయడం ద్వారా తర్ఫీదు ఇవ్వనున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన డ్రైవర్లకు ఆర్టీసీ సంస్థలో మొదట ప్రాధాన్యం కల్పిస్తారు. మరోవైపు ఆర్టీసీలో అద్దెబస్సుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. శిక్షణ పొందిన డ్రైవర్లకు ఇలాంటి బస్సులు నడిపేందుకు అవకాశం కల్పిస్తారు. బయటి డ్రైవింగ్ స్కూల్స్‌లో వాహనాలు ఉన్నా శిక్షణ ఇచ్చేది తక్కువే. దీంతో లారీలు, ఇతర భారీ వాహనాలపై క్లీనర్‌గా వెళ్లి సొంతంగా నేర్చుకున్న వారిలో నైపుణ్యత లేకపోవడంతో ఉపాధి అవకాశాలు కూడా తక్కువగానే ఉంటాయి.

శిక్షణ విధానం ఇలా..
ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ కేంద్రం తెరిచి ఉంటుంది. శిక్షణ పొందే అభ్యర్థి రూ. 15,500 రుసుం చెల్లించాల్సి ఉంటుంది. 18 ఏళ్ల వయస్సు పైబడిన వారు మాత్రమే శిక్షణకు అర్హులు. అభ్యర్థులు శారీరక దారుఢ్యం కలిగి ఉండాలి. లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్ పొంది తప్పనిసరిగా ఏడాది పూర్తయి ఉండాలి. వెసులుబాటును బట్టి ఒక్కో అభ్యర్థికి 36 రోజుల పాటు శిక్షణ ఇస్తారు. మొత్తం 16 గంటలు థియరీ తరగతులు, 20 గంటలు క్షేత్రస్థాయిలో శిక్షణ ఇవ్వనున్నారు. ఆర్టీసీలో శిక్షణ తీసుకున్న వారికి అవకాశాలు మెండుగా ఉన్నాయి.

ప్రచార లోపంతోనే..
ఉమ్మడి జిల్లాలోని మంచిర్యాల, నిర్మల్, ఆసిఫాబాద్, ఆదిలాబాద్‌లో ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటుకు అనుమతులు మంజూరయ్యాయి. ఇందులో ఆదిలాబాద్ మినహాయిస్తే ఎక్కడా అభ్యర్థుల నుంచి స్పందన కరువైంది. ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటు అవకాశాలపై విస్తృతంగా ప్రచారం లేకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఆర్టీసీలో డ్రైవింగ్ శిక్షణ కేంద్రం ప్రారంభం కావాలంటే ఒక బ్యాచ్‌లో 16 మంది అవసరం. ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకుంటే శిక్షణ షురూ చేస్తారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి మోటర్ డ్రైవింగ్ స్కూల్‌పై ప్రచారం నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రచారం నిర్వహిస్తాం

ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌పై విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తాం. అభ్యర్థుల నుంచి దరఖాస్తులు వస్తే శిక్షణ ప్రారంభిస్తాం. ఆర్టీఏ నిబంధనల మేరకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేశాం. శిక్షణకు అవసరమైన ప్రత్యేక బస్సు అందుబాటులో ఉంది.
– రవీంద్రనాథ్, డీఎం, మంచిర్యాల

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

వాంకిడి: ఆటో బోల్తాపడి పలువురికి గాయాలైన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై సాగర్ వివరాల ప్రకారం... శనివారం రాత్రి వాంకిడి వైపు నుంచి ఆసిఫాబాద్ వైపునకు వెళ్తున్న కారును ఆసిఫాబాద్ వైపు నుంచి వాంకిడి వైపునకు వస్తున్న ఆటో మండల కేంద్రంలోని సరాండి ఎక్స్‌రోడ్డు సమీపంలో రహదారిపై అదుపు తప్పి కారును ఢీకొంది. ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా, ఆసిఫాబాద్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన వైరగడె రాజేశ్వర్, బలంపూర్ గ్రామానికి చెందిన వెడమ రాజేశ్వర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో చేర్పించారు. ప్రమాదానికి సంబంధించిన ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ప్రాణం తీసిన మద్యం మత్తు

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఊరు రామకృష్ణాపూర్ రోడ్డులోని ఎమ్మెల్యే కాలనీలో మద్యం మత్తులో కింద పడి అవునూరి శ్రీనివాస్ (36) మృతి చెందాడు. ఎస్సై చంద్రకుమార్ వివరాల ప్రకారం... ఎమ్మెల్యే కాలనీలోని శ్రీనివాస్ మద్యం మత్తులో ఇంటికి సమీపంలో అదుపు తప్పి సిమెంట్ రోడ్డుపై పడడంతో తలకు తీవ్రమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

శ్రీరాంపూర్: సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆర్కే 6 గని నూతన పిట్ కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం గనిపై జరిగిన పిట్ కమిటీ జనరల్ బాడీ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. పిట్ కమిటీ సెక్రెటరీగా కడమండ యూసఫ్, అసిస్టెంట్ పిట్ సెక్రెటరీగా అయిందాల కిశోర్, జనరల్ షిఫ్ట్ ఇన్‌చార్జిగా నాగరాజు, ట్రెజరర్‌గా నవీన్, ఏ రిలే ఇన్‌చార్జిగా కోల రాజు, బీ రిలే ఇన్‌చార్జిగా రాఘవేంద్ర, సీ రిలే ఇన్‌చార్జిగా రిషిదేవ్‌లను ఎన్నుకున్నారు. అసోసియేషన్ బ్రాంచీ కన్వీనర్ దేగల ప్రవీణ్‌కుమార్, కో కన్వీనర్ రెడపాక లక్ష్మణ్, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ వేల్పుల ప్రవీణ్, జాయింట్ సెక్రెటరీలు కుక్క శ్రీనివాస్, అందె వెంకటేశ్, సుందిళ్ల నరేశ్, అడ్వైజర్‌గా లక్ష్మీనారాయణ, రాజలింగు, దాసు పాల్గొన్నారు.



23ఏళ్ల తర్వాత మళ్లీ బడికి

దండేపల్లి: దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1999–2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో మళ్లీ కలుసుకున్నారు. వారంత 23ఏళ్ల క్రితం అదే పాఠశాలలో పదో తరగతి వరకూ కలిసి చదువుకున్నారు. ఉన్నత చదువుల నిమిత్తం విడిపోయారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనంతో ఒకే వేదికపై కనిపించారు. విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను సైతం ఆహ్వానించి సన్మానించారు. 23ఏళ్ల తర్వాత చిన్ననాటి మిత్రులు ఒకే చోట కలుసుకోవడంతో వారి ఆనందాలకు అవధులు లేకుండా పోయాయి.



అపూర్వ కలయిక

జన్నారం: మండలంలోని తపాలపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2002–2003 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. 20 ఏళ్ల తరువాత అందరూ ఒకేచోట కలుసుకుని ఆనందంగా గడిపారు. అప్పట్లో బోధించిన ఉపాధ్యాయులతో పాటు ప్రస్తుత హెచ్‌ఎం తిరుపతిని సన్మానించారు.

ప్రశాంతంగా కానిస్టేబుల్ తుది రాతపరీక్ష

- ఆదిలాబాద్‌లో 12 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- 4768 మంది అభ్యర్థుల హాజరు
- పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్: కానిస్టేబుల్ తుది రాత పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరిగింది. పరీక్షకు నిమిషం ఆలస్యం నిబంధన ఉండడంతో ఆయా ప్రాంతాల నుంచి అభ్యర్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. అయితే ఉదయం 6 గంటల సమయంలో వర్షం కురవడంతో అభ్యర్థులు కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దాదాపు గంటకు పైగా భారీ వర్షం కురవడంతో వారు కొంత ఆందోళనకు గురయ్యారు. వర్షం తగ్గుముఖం



పరీక్ష కేంద్రం వద్దకు చేరుకున్న అభ్యర్థులు

పట్టడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో 12 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 4820 మంది హాజరు కావల్సి ఉండగా, 4768 మంది హాజరయ్యారు. 52 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేశారు. డీఎస్పీ, సీఐ, ఎస్సైల ఆధ్వర్యంలో కేంద్రాల వద్ద పర్యవేక్షణ కొనసాగింది. పోలీసులు బందోబస్తు చేపట్టారు.

పోలీసు వాహనాల్లో పరీక్ష కేంద్రాల వరకు..

ఆదిలాబాద్‌లో భారీ వర్షం కురవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారు. ఆయాచోట్ల అభ్యర్థులను గమనించిన పోలీసు పెట్రోలింగ్ సిబ్బంది వారిని వాహనాల్లో కేంద్రాల వరకు తరలించారు. ఇదిలా ఉండగా జిల్లా నలుమూలల నుంచి అభ్యర్థులు రావడంతో పట్టణమంతా సందడిగా మారింది. బస్టాండ్ ప్రాంతం వారితో కిటకిటలాడింది. చిన్న పిల్లలతో పరీక్ష కేంద్రానికి వచ్చిన మహిళ అభ్యర్థులు కొంత ఇబ్బందులకు గురయ్యారు. చిన్న పిల్లలను పరీక్ష కేంద్రం లోనికి అనుమతించక పోవడంతో పరీక్ష అయ్యే వరకు వారి బంధువులు పిల్లల్ని ఆడిస్తూ కనిపించారు.



చిన్నారిని ఆడిస్తున్న మహిళ



కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



అభ్యర్థులను కేంద్రానికి తరలిస్తున్న పోలీసులు

కల్యాణ ఘడియలు

- ఈనెల 3 నుంచి మోగనున్న భాజాభజంత్రీలు
- మే, జూన్ నెలల్లో 23 మంచి రోజులు

నిర్మల్‌చైన్‌గేట్: శుభముహూర్తాలు వచ్చేశాయి. గురు మూఢం కారణంగా ఏప్రిల్ నెలలో పెళ్లిళ్లకు శుభముహూర్తాలు లేవు. ఈనెల 3న బుధవారం నుంచి పెళ్లి భాజాభజంత్రీలు మోగనున్నాయి. జిల్లాలో పెళ్లి సందడి నెలకొంది. దుకాణాలు కొనుగోలుదారులతో కళకళలాడనున్నాయి. పెళ్లి మండపాలు ముస్తాబవుతున్నాయి. శుభలేఖల ప్రింటింగ్ పనులు పూర్తి కాగా, వంటవారు, భాజాభజంత్రీల వారు, పురోహితులు అంతా సిద్ధమవుతున్నారు.

శుభముహూర్తాలు ఇలా..

ఈనెల 3 నుంచి వరుసగా 4, 5, 6, 7, 8, 10, 11, 12, 13, 21, 26, 27, 28, 30, 31, జూన్‌లో 1, 3, 7, 8, 9, 10, 11 తేదీల్లో ముహూర్తాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో శుభకార్యాలు జరగనున్నాయి. జూన్ 19 నుంచి ఆషాఢమాసం మొదలై, జులై మొత్తం అధిక శ్రావణం కావడంతో ఆగస్టు 18 వరకు ముహూర్తాలు లేవు. తిరిగి ఆగస్టు 19న మంచిరోజులు ప్రారంభమై డిసెంబర్ 31 వరకు ఉన్నాయి.

రద్దీగా దుకాణాలు

ఈనెల 3 నుంచి పెళ్లిళ్ల నేపథ్యంలో బంగారు, వస్త్ర దుకాణాలు రద్దీగా మారాయి. నిర్వాహకులు ఇప్పటికే అన్ని ఫంక్షన్ హాళ్లు ముందస్తుగా బుక్ అయ్యాయి. ఈసారి అధికంగా ముహూర్తాలు ఉండటంతో నిశ్చితార్థం నుంచి పెళ్లి వరకు మొత్తం 25 రంగాల వారికి చేతినిండా ఉపాధి ఉండనుంది. వేద బ్రాహ్మణులు, బ్యాండ్ మేళం, సౌండ్ సిస్టమ్, లైటింగ్, డెకరేషన్, క్యాటరింగ్, వంటలు చేసేవారు,



ఈవెంట్ ఆర్గనైజర్లు, ఫొటోగ్రాఫర్లు, వ్యాపారులు తదితరులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రెండునెలల్లో మంచి రోజులు



ఏప్రిల్‌లో ముహూర్తాలు లేవు. మే, జూన్ నెలలో 23 మంచిరోజుల్లో పెళ్లిళ్లు జరగనున్నాయి. జులైలో మంచి రోజులు లేవు. ఆగస్టు 19 నుంచి మంచి రోజులు ప్రారంభమై డిసెంబర్ 31 వరకు ఉన్నాయి.

– పట్వారీ శ్రీనివాస్, ఆలయ పూజారి

క్రీడల నిర్వహణకు సింగరేణి ప్రోత్సాహం

బెల్లంపల్లి: క్రీడా పోటీల నిర్వహణకు సింగరేణి యాజమాన్యం తగిన ప్రోత్సాహం అందిస్తుందని మందమర్రి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ జి.మోహన్ రెడ్డి తెలిపారు. బెల్లంపల్లి పట్టణంలోని ఏఎంసీ క్రీడా మైదానంలో ఆదివారం ఏర్పాటు చేసిన బీపీఎల్ ప్రీమియర్ లీగ్ ఫర్ వెటరన్ లెజెండ్స్ టీ–20 క్రికెట్ పోటీలను జీఎం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రికెట్ పోటీలను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జీఎం మాట్లాడారు. బెల్లంపల్లి పట్టణం క్రీడా పోటీలకు పుట్టినిల్లన్నారు. సింగరేణిలో పని చేసి ఎందరో క్రీడాకారులుగా ఎదిగారన్నారు. ఉద్యోగ విరమణ చేసిన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రికెట్ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. బెల్లంపల్లిలో ఎప్పుడు క్రీడా పోటీలు నిర్వహించినా తనవంతు సహకారం అందిస్తానని స్పష్టం చేశారు. వయస్సుతో సంబంధం లేకుండా ఉత్సాహంగా క్రీడలు ఆడి ఆరోగ్యంగా జీవించాలని కోరారు. ప్రతి ఒక్కరూ క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు.

విజేతగా సోని టీమ్

క్రికెట్ పోటీల్లో పలు టీమ్‌లు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్ నల్గొండ, బెల్లంపల్లి సోని టీమ్‌ల మధ్య హోరాహోరీగా సాగింది. ఆధిపత్యం కనబరిచి నల్గొండ టీమ్‌పై సోని టీమ్ విన్నర్స్‌గా నిలిచింది. విజేతగా నిలిచిన సోనీ టీమ్‌కు రిటైర్డ్ సీబీసీఐడీ అడిషనల్ ఎస్పీ పి.రవికుమార్ ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో క్రికెట్ పోటీల ఆర్గనైజర్లు ఖలీం పాషా, సంపత్‌రెడ్డి, సింగరేణి రిటైర్డు జీఎంలు హసన్ అబ్బాస్, సూర్యదాస్, రిటైర్డు డీవైజీఎం జె.కిరణ్‌కుమార్, సీనియర్ పర్సనల్ మేనేజర్ రామకృష్ణ, సీనియర్ క్రీడాకారులు టి.పోచన్న, డగ్లస్ విన్సెంట్, సలీం, శేఖర్, ఆర్.తిరుపతిరెడ్డి, దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న జీఎం మోహన్‌రెడ్డి

శ్రమ శక్తి అవార్డుకు ఎంపిక



కే సురేందర్‌రెడ్డి



పెట్టం లక్ష్మణ్



పానుగంటి సత్తయ్య

శ్రీరాంపూర్: రాష్ట్ర కార్మిక శాఖ ప్రతీ మేడే సందర్భంగా అందించే శ్రమశక్తి అవార్డుకు ఈసారి శ్రీరాంపూర్ డివిజన్ నుంచి ముగ్గురు కార్మిక వర్గ నేతలు ఎంపికయ్యారు. టీబీజీకేఎస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు కేటిరెడ్డి, జీఎం చర్చల కమిటీ ప్రతినిధి పెట్టం లక్ష్మణ్, ఏరియా కార్యదర్శి పానుగంటి సత్తయ్య, ఆర్కె 5 మైనింగ్ సర్దార్ శ్రీనివాస్‌రావును ఎంపిక చేశారు. వీరిలో సురేందర్‌రెడ్డి ఎస్సార్పీ 3 గనిలో డెప్యూటీ సూపరింటెండెంట్‌గా పని చేసి 2023 ఫిబ్రవరీలో రిటైర్డ్ అయ్యారు. పెట్టం లక్ష్మణ్ ఎస్సార్పీ 1 గనిలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. పానుగంటి సత్తయ్య ఆర్కే 6 గనిలో ఎలక్ట్రీషియన్ ఫిట్టర్‌గా పని చేసి 2019 రిటైర్డ్ అయ్యారు. రాష్ట్ర స్థాయి శ్రమ శక్తి అవార్డుకు వీరు ఎంపిక కావడంపై టీబీజీకేఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. రాష్ట్ర కార్మిక శాఖ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగే మేడే వేడుకల్లో కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి, ఇతర అధికారుల చేతుల మీదుగా ఈ అవార్డులను వీరికి ప్రదానం చేయనున్నారు.

మందమర్రి ఏరియా నుంచి

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో నలుగురికి శ్రమశక్తి అవార్డుకు ఎంపికయ్యారు. టీబీజీకేఎస్ యూనియన్ నాయకులు జీడి బాబు, బాబురావు, ఈశ్వర్, శంకర్‌రావు 'మే' డే సందర్భంగా మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ కార్మికుడి మృతి

రామకృష్ణాపూర్: రోడ్డు ప్రమాదంలో ఊరు రామకృష్ణాపూర్‌కు చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు కొల్లూరి రాజయ్య(60) మృతి చెందాడు. బైక్‌పై మంచిర్యాలకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా క్యాతనపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఎదురుగా వచ్చిన ఓ కారు వేగంగా ఢీకొట్టడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. 108 లో వెంటనే మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. ఎస్సై అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జంటహత్యల కలకలం

- గుడిహత్నూర్ శివారులో మృతదేహాలు
- ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన రహమాన్, వివాహిత అశ్వినిగా గుర్తింపు..



రహమాన్, అశ్విని మృతదేహాలు

గుడిహత్నూర్: ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం సీతాగోంది పంచాయతీ పరిధిలోని గర్కంపేట సమీపంలో లభ్యమైన జంట మృతదేహాలు ఆదివారం కలకలం రేపాయి. కుళ్లిపోయే దశలో చేనులో పడి ఉన్న మృతదేహాలను స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించగా విషయం వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి, ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ అక్కడికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. మృతుల తలలు తీవ్రంగా గాయపరిచి హత్య చేసినట్లుగా ప్రాథమికంగా నిర్ధారించారు.

హత్యకు గురైంది వీరే..

ఘటనాస్థలం సమీపంలోని బీటీరోడ్డుపై నిలిచిన ఉన్న స్కూటీని పరిశీలించిన పోలీసులు వాహన నంబర్ ఆధారంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఖుర్షీపూర్‌కు చెందిన మహమ్మద్ రహమాన్ (20)గా, సుందరయ్యనగర్‌కు చెందిన వివాహిత సోన్‌కాంబ్లే అశ్విని (28)గా గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నైలు, ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌తో..

మృతులిద్దరూ ఒకే రకమైన దెబ్బలతో చనిపోవడంతో హత్యగా భావించిన పోలీసులు క్లూస్ టీంతో పాటు డాగ్ స్క్వాడ్‌ను రప్పించి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలు కుళ్లిపోయే స్థితిలో ఉండడంతో రెండురోజుల క్రితం ఘటన జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు.

అక్రమ సంబంధమే హత్యలకు దారితీసిందా..?

రహమాన్, అశ్వినిల హత్య వెనుక కారణాలపై మండలంతో పాటు జిల్లా కేంద్రంలో చర్చనీయాంశమైంది. మహమ్మద్ రహమాన్ తన బాబాయికి చెందిన ఆర్టీఏ ఏజెంట్ కార్యాలయంలో ఉండేవాడు. ఇదే క్రమంలో సమీపంలోని స్పిన్నింగ్ మిల్లులో పనిచేస్తున్న సోన్‌కాంబ్లే అశ్వినితో పరిచయం ఏర్పడింది. ఇది అక్రమ సంబంధానికి దారి తీసినట్లు తెలుస్తోంది. కాగా అశ్విని భర్త రమేశ్ ట్రాక్టర్‌పై కూలిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరికి కుమారుడు లోకేష్ (8), కూతురు సునాక్షి (4)ఉన్నారు. అయితే గత శుక్రవారం రహమాన్ తన అన్నకు చెందిన స్కూటీపై అశ్వినిని తీసుకొని సీతాగోంది మీదుగా గర్కంపేట వైపు వెళ్లాడు. ఈ దృశ్యాలు సీతాగోంది పంచాయతీ సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. వారు ఇంటికి రాకపోగా హత్యకు గురవడం ఇరుకుటుంబాలను కలచివేసింది.

జిల్లా కేంద్రంలో ఉద్రిక్తత

ఆదిలాబాద్: మృతదేహాలను రిమ్స్‌కు తరలించగా ఇరు కుటుంబాలు, బంధువులు, సన్నిహితులు అక్కడికి చేరుకున్నారు. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతులకు సంబంధించిన కాలనీల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం అంత్యక్రియల నిమిత్తం ఇరుకుటుంబాలకు మృతదేహాలను అప్పగించారు.

హోరాహోరీగా కిక్ బాక్సింగ్ పోటీలు



పోటీలు ప్రారంభిస్తున్న జిల్లా అధ్యక్షుడు హరికృష్ణ

మంచిర్యాలక్రైం: మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఈ నెల 28న ప్రారంభమైన తెలంగాణ రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు రెండో రోజులుగా హోరాహోరీగా కొనసాగుతున్నాయి. రెండోరోజు కిక్ బాక్సింగ్ పోటీలను జిల్లా అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు ప్రారంభించారు. స్థానిక ఎస్‌ఎస్ ఫంక్షన్‌హాల్ నిర్వహిస్తున్న ఈ పోటీలకు తెలంగాణ రాష్ట్రంలోని అన్నీ జిల్లాల నుంచి సుమారు 1000 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అనంతరం ఒలంపిక్ అసోసియేషన్ తరుపున అబ్జర్వర్‌గా వచ్చిన వివేక్‌ను కిక్ బాక్సింగ్ జిల్లా అసోసియేషన్ తరుపున ఘనంగా సన్మానించారు.

సీఎంకు శుభాకాంక్షల వెల్లువ











హైదరాబాద్‌లో నూతన సచివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్‌ను మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలోని ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్ప గుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.